మైక్రోసాఫ్ట్ విండోస్‌కు కొత్త చీఫ్‌గా పవన్ దావులూరి



4లో.

RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

సంపుటి - 1 సంచిక - 179 బుధవారం 27 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



# తీహార్ జైలులో కవితకు రిమాండ్

**కవితకు రిమాండ్ విధించిన కోర్టు.. తీహార్ జైలుకు తరలించాలని ఆదేశం**

**బెయిల్ పిటిషన్ ను తిరస్కరించిన రౌస్ అవెన్యూ కోర్టు**

**కవితకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన కోర్టు**

**మార్చి 26(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు భారీ షాక్ తగిలింది. కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ ను రౌస్ అవెన్యూ కోర్టు తిరస్కరించింది. ఈ నాటి విచారణ సందర్భంగా ఆమె పిటిషన్ పై తీర్పును కాసేపు రిజర్వ్ లో ఉంచిన కోర్టు... కాసేపటి క్రితం తీర్పును వెలువరించింది. ఆమెకు 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఏప్రిల్ 9వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తీర్పును వెలువరించింది. ఆమెను తీహార్ జైలుకు తరలించాలని పోలీసులను ఆదేశించింది. కాసేపట్లో కవితను తీహార్ జైలుకు పోలీసులు తరలించనున్నారు. కోర్టు తీర్పుతో బీఆర్ఎస్ శ్రేణులు షాక్ కు గురయ్యారు. మరోవైపు, కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్ పై ఏప్రిల్ 1న పూర్తి విచారణ జరుపుతామని కోర్టు తెలిపింది. తన కుమారుడికి పరీక్షలు ఉన్నాయని, తనకు మధ్యంత బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కవిత కోరారు. అయితే, ఆమె విన్నపాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ఇంకోవైపు, కవితను మరో 15 రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరినప్పటికీ... ఆమెకు కోర్టు రిమాండ్ విధించడం గమనార్హం. రిమాండ్ లో ఉన్న కవితను ఈడీ తమ కస్టడీకి కోరే అవకాశం ఉంది.

# తుక్కుగూడ నుంచి ఎన్నికల శంఖారావం

- సీఎం రేవంత్ రెడ్డి
- తుక్కుగూడలో ఏప్రిల్ 6 లేదా 7వ తేదీన కాంగ్రెస్ జాతీయ సభ ఉంటుందని వెల్లడి
- కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయాల స్ఫూర్తితో జాతీయస్థాయిలో గ్యారెంటీల ప్రకటన ఉంటుందన్న సీఎం
- లోక్ సభ ఎన్నికలు 100 రోజుల పాలనకు రెఫరెండం అన్న రేవంత్ రెడ్డి



**మార్చి 26(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** తుక్కుగూడ నుంచి దేశ రాజకీయాలకు శంఖారావం పూరిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తుక్కుగూడలో ఏప్రిల్ 6 లేదా 7వ తేదీన కాంగ్రెస్ జాతీయస్థాయి సభ ఉంటుందన్నారు. కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయాల స్ఫూర్తితో జాతీయస్థాయిలో గ్యారెంటీల ప్రకటన ఉంటుందన్నారు.తుక్కుగూడ సభలోనే జాతీయస్థాయి గ్యారెంటీలపై ప్రకటన చేస్తారని తెలిపారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనాయకుడు రాహుల్ గాంధీ హాజరవుతారన్నారు.

మిగతా 2లో.

# రేవంత్ రెడ్డీ, ఇక్కడ భయపడేవాళ్లు లేరు

**వెంట్రుక కూడా పీకలేవ్: కేటీఆర్ తీవ్ర ఆగ్రహం**

**కిషన్ రెడ్డి కిస్మత్ బాగుండి కేంద్రమంత్రి అయ్యారని ఎద్దేవా**

**కుర్కురేలు పంచడం, లిఫ్ట్‌లు ప్రారంభించడం తప్ప కిషన్ రెడ్డి చేసిందేమీ లేదని విమర్శ**

**లోక్ సభ ఎన్నికల తర్వాత రేవంత్ రెడ్డి బీజేపీలోకి వెళ్లడం ఖాయమని వ్యాఖ్య**



2లో.

# ట్యాపింగ్ ద్వారానే నాడు రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేశారు

: రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు

**2014 నుంచే ఫోన్ ట్యాపింగ్‌లు జరిగినట్లుగా అర్థమవుతోందని వ్యాఖ్య**

**టెలిఫోన్ల ట్యాపింగ్ మీద చిత్తశుద్ధితో విచారణ జరిపించాలని విజ్ఞప్తి**

**ఈ వ్యవహారంలో కేటీఆర్, హరీశ్ రావు, అధికారులను ముద్దాయిలుగా చేర్చాలని డిమాండ్**



2లో.

# ఫోన్ ట్యాపింగ్‌పై న్యాయవిచారణ చేయాలి

**నాటి సీఎం బాధ్యత వహించాలికిషన్‌రెడ్డి డిమాండ్**

**భాజపా నేతల ఫోన్లనూ ట్యాప్ చేశారని ఆరోపణ**

**దిల్లీ మద్యం కేసులో కవిత పాత్రపై చర్చకు రావాలని కేసీఆర్‌కు సవాల్**



**మార్చి 26(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** భారాస ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై ఉన్నతస్థాయి దర్యాప్తుతోపాటు న్యాయ విచారణ చేయాలని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ట్యాపింగ్ వ్యవహారాలకు అప్పటి ముఖ్యమంత్రి బాధ్యత వహించాలన్నారు. నాటి సీఎం, డీజీపీ, రిటైర్డ్ అధికారులు ఏ రకంగా కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. మంగళవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. "భాజపా నాయకులు, ఆఫీసు సిబ్బంది ఫోన్లను ట్యాప్ చేసిన ఆధారాలు వెలుగులోకి వస్తున్నాయి. రాజకీయ నాయకులవే కాకుండా అధికారులు, వ్యాపారుల ఫోన్లనూ ట్యాప్ చేసి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించారు. కొంతమంది పోలీసు అధికారులు మాఫియాగా ఏర్పడి వసూళ్ల కోసం ఇలా చేయడం దుర్మార్గం. 2019 పార్లమెంటు ఎన్నికల్లో బ్యాంకు నుంచి పార్టీ డబ్బు డ్రా చేసుకుని వస్తుంటే ట్యాపింగ్ ద్వారా వివరాలు తెలుసుకుని భాజపా కార్యాలయ సిబ్బందిని చుట్టుముట్టి పట్టుకున్నారు.. చివరకు తప్పు తెలుసుకున్నారు. భాజపాను విమర్శిస్తే సహించేది లేదు.. ఆ కుటుంబం అవినీతిని ప్రజల ముందుంచుతాం. బెయిల్ కూడా నిరాకరించిన మద్యం కేసులో కవిత కడిగిన ముత్యంలా ఎలా బయటకు వస్తారో తెలంగాణ ప్రజలు తెలుసుకోవాలని అనుకుంటున్నారు. హైదరాబాద్ చెంగిచర్ల కబేళా వద్ద రెండు రోజుల క్రితం గిరిజన మహిళలపై ఒక వర్గం దాడి చేసి 30 మందిని తీవ్రంగా గాయపరిచినా హత్యాయత్నం కేసులు నమోదు చేయలేదు.. ఒక్కర్నీ అరెస్ట్ చేయలేదు. ఈ వ్యవహారంపై ఇప్పటికే జాతీయ ఎస్టీ కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌కు పిర్యాదు చేశాం. చెంగిచర్ల కబేళా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తోంది. దీన్ని వెంటనే మూసివేయాలి" అని డిమాండ్ చేశారు.

# తాగునీటి సమస్య లేకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్...

**రాష్ట్రంలోని మూడు ప్రధాన రిజర్వాయర్లలో సరిపడా నీటి లభ్యత ఉందని వెల్లడి**

**ప్రస్తుత వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవన్న సీఎస్ శాంతికుమారి**

**ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు గత ఏడాదిలాగే ఉన్నందున ఆందోళన అవసరం లేదన్న సీఎస్**

**అయినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను రూపొందించుకోవాలని కలెక్టర్లకు సూచన**



2లో.

# రేవంత్ రెడ్డీ, ఇక్కడ భయపడేవాళ్లు లేరు...

**మార్చి 26(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** "రేవంత్ రెడ్డీ, ఇక్కడ భయపడేవాళ్లు ఎవరూ లేరు... వెంట్రుక కూడా పీకలేవ్" అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సికింద్రాబాద్ లోక్ సభ పరిధి ముఖ్య నేతల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ... ఈ అయిదేళ్ల కాలంలో కిషన్ రెడ్డి ఏ ఒక్క అభివృద్ధి పని చేయలేదని... కిస్మత్ బాగుండి కేంద్రమంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట నుంచి కాలేరు వెంకటేశ్‌ను ప్రజలు గెలిపించారన్నారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయిన కిషన్ రెడ్డి సికింద్రాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచి.. కిస్మత్ బాగుండి కేంద్రమంత్రి అయ్యారన్నారు.

కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి చేసిన గొప్ప పనులు మూడంటే మూడు చేశారని విమర్శించారు. కరోనా వస్తే చాలామంది అన్నదానాలు చేశారని, అంబులెన్స్‌లు ఇచ్చారనీ, కిషన్ రెడ్డి మాత్రం కుర్‌కురేలు పంచారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తే, కిషన్ రెడ్డి సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్‌లో రెండు లిఫ్టులు ప్రారంభించారని, నాంపల్లిలో సింటెక్స్ ట్యాంకులు ప్రారంభించారని ఎద్దేవా చేశారు. మూసీకి వరద వస్తే కిషన్ రెడ్డి రూపాయి తేలేదని విమర్శించారు.



కనీసం అంబర్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి పూర్తి కాలేదన్నారు. రేవంత్ రెడ్డి ఇటీవల బైరామల్‌గూడలో ప్రారంభించిన ఫ్లైఓవర్ మనం కట్టించిందే అని చెప్పారు. కిషన్ రెడ్డికి ఓటేయాలని ఎవరైనా చెబితే అంబర్‌పేట ఫ్లైఓవర్ చూసి రమ్మనాలని సూచించారు. కిషన్ రెడ్డి ఇష్టంవచ్చినట్లు నోరు పారేసుకోవద్దని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఏవైనా ఆధారాలు ఉంటే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ పదేళ్లు దేశానికి మోదీ ఏం చేశారని చెప్పడానికి కిషన్ రెడ్డి వద్ద ఏమీ లేదన్నారు.

### బీజేపీలోకి జంప్ అవడం ఖాయం..

రేవంత్ రెడ్డీ, ఇక్కడ భయపడేవాళ్లు ఎవరూ లేరు.. వెంట్రుక కూడా పీకలేవని కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. లోక్ సభ ఎన్నికల తర్వాత రేవంత్ రెడ్డి తన ముఠాతో బీజేపీలోకి జంప్ అవడం ఖాయమని... ఇది రాసిపెట్టుకోవచ్చునని చెప్పారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి 40 లోక్ సభ స్థానాలు దాటే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. తాను మాట్లాడే ప్రతి మాటకు రేవంత్ రెడ్డి స్పందిస్తుంటాడని... కానీ బీజేపీలోకి వెళతావనే తన ఆరోపణకు మాత్రం స్పందించడం లేదన్నారు. ఆడపిల్లల పెళ్లిళ్లకు తులం బంగారం ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదని విమర్శించారు. రైతుబంధు ఇవ్వడం లేదన్నారు.
ఫోన్ ట్యాపింగ్ అంటూ లీక్‌లు ఇస్తున్నాడు... ఏదైనా జరిగితే విచారణ చెయ్... తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకో... ఇక్కడ భయపడేవాళ్లు ఎవరూ లేరని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఎన్నికలకు డబ్బుల కోసం రైస్ మిల్లర్లను, బిల్డర్లను బెదిరిస్తున్నారని ఆరోపించారు. అందరినీ బెదిరిస్తూ ఢిల్లీకి రూ. 2,500 కోట్లు జమ చేసిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు.

# కులగణన అంటూ కులపోళ్లకు సీట్లు ఇవ్వరా?

## కాంగ్రెస్‌లో అధిక సీట్లకోసం బిసిల పట్టు ..

**మార్చి 26(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్‌లో బీసీలు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. కనీసం ఆరు లోక్‌సభ స్థానాలు బీసీలకు ఇవ్వాలని అధిష్టానంపై ఒత్తిడి పెంచుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మాట ఇచ్చి తప్పారని మండిపడుతున్నారు. ప్రతి లోక్‌సభ పరిధిలో రెండు అసెంబ్లీ సీట్ల చొప్పున బీసీలకు 34 సీట్లు కేటాయిస్తామని మాటిచ్చారని, తీరా ఎన్నికల సమయానికి కేవలం 23 సీట్లు మాత్రమే ఇచ్చారంటున్నారు. ఇక.. అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేసి సామాజిక న్యాయం చేస్తామని రాహుల్ గాంధీ చెబుతుంటే.. తెలంగాణ కాంగ్రెస్‌లో మాత్రం బీసీలకు తగిన ప్రాధాన్యం లేదని వీహెచ్ వంటి సీనియర్లు వాపోతున్నారు. మరోవైపు బీజేపీ ఐదు స్థానాలు, బీఆర్ఎస్ ఆరు స్థానాలు బీసీలకు కేటాయించాయి. దీంతో కాంగ్రెస్‌పై కూడా బీసీ నేతలు మెజారిటీ సీట్లు కేటాయించాలని ఒత్తిడి చేస్తున్నారు.తెలంగాణ కాంగ్రెస్ ఇప్పటివరకు తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో రెండు ఎస్సీ, ఒకటి ఎస్టీ రిజర్వుడు స్థానాలకు అభ్యర్థుల పేర్లు వెల్లడించింది. మిగతా ఆరు స్థానాల్లో కేవలం రెండు మాత్రమే బీసీలకు కేటాయించింది. జహీరాబాద్ నుంచి సురేష్ షెట్కార్, సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్‌కు అధిష్టానం అవకాశమిచ్చింది. ఇంకా ఎనిమిది స్థానాలు పెండింగ్‌లో ఉండటంతో%గా% వీటిలో కనీసం నాలుగు స్థానాలు బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న చర్చ ప్రకారం మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి బీసీ అభ్యర్థి






నీలం మధు పేరు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. అలాగే.. బీసీలకు మరో మూడు చోట్ల అవకాశం కల్పించాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఖమ్మం టికెట్ కోసం సీనియర్ నేత వి.హనుమంతరావు పోరాటం చేస్తున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్క బీసీకి కూడా టికెట్ ఇవ్వలేదని..ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు అవకాశం కల్పించాలని బీసీ నేతలు కోరుతున్నారు. అలాగే.. భువనగిరి నుంచి పున్న కైలాష్ టికెట్ ఆశిస్తున్నారు. ఇక్కడ బీసీలకు టికెట్ ఇస్తే పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కోమటిరెడ్డి బ్రదర్స్ బహిరంగంగా చెబుతున్నారు. నిజామాబాద్ నుంచి బీసీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలితకు టికెట్ ఇవ్వాలని పార్టీ సీనియర్ నేత షబ్బీర్ అలీ సూచిస్తున్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అంటూ లోక్‌సభ ఎన్నికల్లోనే న్యాయం జరగాలనే బీసీ నేతల బిగ్ డిమాండ్‌పై కాంగ్రెస్ హైకమాండ్ ఎలా స్పందిస్తుందో చూడాలి.

# తాగునీటి సమస్య లేకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్...

## ఆందోళన అవసరంలేదు: తెలంగాణ సీఎస్ శాంతికుమారి

**మార్చి 26(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటికే 'సమ్మర్ యాక్షన్ ప్లాన్'ను రూపొందించామని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. తాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలోని మూడు ప్రధాన రిజర్వాయర్లలో సరిపడా నీటి లభ్యత ఉందన్నారు. ప్రస్తుత వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవని... ఆందోళన అవసరం లేదని తెలిపారు. ఇప్పటికే బోరు బావుల ఫ్లషింగ్, పైపుల మరమ్మతులు పూర్తయినట్లు వెల్లడించారు. నిర్వహణపరమైన లోపాలను ఎప్పటికప్పుడు వెంటనే సవరించి నీటి సరఫరాకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రతీరోజు గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాపై సంబంధిత క్షేత్రస్థాయి అధికారులు, నోడల్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించాలని సూచించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మంజూరైన పనులన్నీ సకాలంలో పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా ఆపరేషన్, మెయింటెనెన్స్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇతర రాష్ట్రాలలోని తాగునీటి సమస్యను తెలంగాణకు కూడా అన్వయిస్తూ ఆందోళనకరమైన కథనాలు వస్తున్నాయని... కానీ రాష్ట్రంలో ఈసారి లోటు వర్షపాతం ఉన్నా, ప్రధాన జలాశయాలు, ఎస్సారెస్పీ, శ్రీపాద ఎల్లంపల్లి, నాగార్జున సాగర్‌తో గత సంవత్సరం మాదిరిగానే నీటి మట్టాలు ఉన్నందున ఆందోళన అవసరం



లేదన్నారు.అయినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కొన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో నిర్వహణపరంగా ఉన్న లోపాలను పరిష్కరించినట్లు చెప్పారు. నీటి సమస్యలపై వివిధ మాధ్యమాల ద్వారా వచ్చే వార్తలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏప్రిల్ రెండో వారం అనంతరం రిజర్వాయర్ల నుండి ఎమర్జెన్సీ పంపింగ్‌ను చేపడతామన్నారు. హైదరాబాద్ నగరంలోనూ సరిపడా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. కమర్షియల్ అవసరాల కోసం డిమాండ్ ఎక్కువగా ఉన్నట్లు తెలిసిందన్నారు.

# తుక్కుగూడ నుంచి ఎన్నికల శంఖారావం

మిగతాది 2లో...

లోక్ సభ ఎన్నికల్లో 14 స్థానాలు గెలుచుకోవాలని వ్యాఖ్యానించారు. మన 100 రోజుల పాలనకు ఈ ఎన్నికలు రెఫరెండమని చెప్పారు. స్థానిక నేతల నుంచి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే ఎంపీ అభ్యర్థుల ఎంపిక జరిగిందన్నారు. చేవెళ్ల, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్ నియోజకవర్గాలకు ఒకదానితో మరొకదానికి సంబంధం ఉందన్నారు.ప్రధాని మోదీ తన పదేళ్ల కాలంలో తెలంగాణకు ఏం చేశారని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. గుజరాత్‌కు బుల్లెట్ రైలు తీసుకువెళ్తున్న మోదీ వికారాబాద్‌కు కనీసం ఎంఎంటీఎస్ కూడా తీసుకు రాలేదని విమర్శించారు. సబర్మతి రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసిన మోదీ.. మూసీ రివర్ ఫ్రంట్‌కు మాత్రం నిధులివ్వలేదన్నారు. అసలు ఏం చూసి మోదీకి ఓటు వేయాలి? అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తేనే ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ ద్వారానే నాడు రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేశారు

**మార్చి 26(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గతంలో ఫోన్ ట్యాపింగ్ ద్వారానే అరెస్ట్ చేశారని బీజేపీ మెదక్ లోక్ సభ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. దీనిని బట్టి 2014 నుంచే ఫోన్ ట్యాపింగ్‌లు జరిగినట్లుగా అర్థమవుతోందన్నారు. ఆయన మంగళవారం మీడియాతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై మాట్లాడుతూ... టెలిఫోన్ల ట్యాపింగ్ మీద చిత్తశుద్ధితో విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఫోన్ ట్యాపింగ్ జరిగినప్పుడు డీజీపీ, ఎస్ఐబీ చీఫ్ ఎవరున్నారో కూడా చూడాలన్నారు. ఈ వ్యవహారంలో అధికారులను కూడా క్షమించకూడదని సూచించారు.
ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మొదటి ముద్దాయిగా కేటీఆర్, రెండో ముద్దాయిగా హరీశ్ రావు, మూడో ముద్దాయిగా సిద్దిపేట మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డిని చేర్చాలని డిమాండ్ చేశారు. అసలు నిందితులను ముద్దాయిలుగా చేర్చకపోతే కేసు పూర్తి కాదన్నారు. కుటుంబ సభ్యుల ఫోన్లను ట్యాపింగ్ చేసే అధికారం ఎవరికీ లేదన్నారు.గత డీజీపీ పీఏ శ్రీనాథ్ రెడ్డి అధికారిక ఖర్చుతో అమెరికా వెళ్లారని వెల్లడించారు. ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసి చేతులు దులుపుకోవడం కాదని... ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ కారణంగానే మునుగోడు ఉప ఎన్నికల్లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఓడిపోయినట్లు చెప్పారు.

# ఏప్రిల్ 8 నుంచి 17 వరకు హాలిడేస్!



**ఏప్రిల్ 20వ తేది నుంచే సమ్మర్ హాలిడేస్**
**జూన్ 13నుంచి కొత్త అకాడమిక్ ఇయర్ ప్రారంభం**
**ఈసారి వేసవి సెలవులు ఏకంగా 50 రోజులు**
**వార్షిక పరీక్షలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు**

**మార్చి 26(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** ఏపీ, తెలంగాణాలలోని పాఠశాలల్లో ఒంటి పూట బడులు కొనసాగుతన్నాయి. అలాగే ఎండలు విపరీతంగా ఉన్న సందర్భంగా ఈసారి వేసవి సెలవులు కూడా తొందరగా వచ్చే అవకాశాలున్నాయి. ఏప్రిల్ నెలలో పాఠశాలలు, కాలేజీలకు వరుస సెలువులు రానున్నాయి. ఉగాది, రంజాన్, శ్రీరామనవమి సందర్భంగా వారం రోజుల్లో వరుసగా 4 రోజులు సెలవులు ఉండబోతున్నాయి. వీటితో పాటు.. రెండో శనివారం, ఆదివారం కూడా ఉండటంతో.. ఏప్రిల్ 8 నుంచి ఏప్రిల్ 17 వరకు వరుసగా స్కూళ్లకు సెలవులు రానున్నాయి. అలాగే కాలేజీలకు కూడా సెలవులు ఇవ్వనున్నారు.వేసవి సెలవులు కూడా.. ఏప్రిల్ 18 లేదా ఏప్రిల్ 20 నుంచి ఇవ్వనున్నట్లు సమాచారం. దాదాపు స్కూల్స్‌కి 50 రోజులు పాటు ఈ సారి సెలవులు ఉండే అవకాశం ఉంది. గత ఏడాది కంటే ఈ సారి వేసవి సెలవులు ఎక్కవగా ఇచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వార్షిక పరీక్షలను త్వరగా పూర్తి చేయాలని విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇక జూన్ 13న కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది.

# భగ్గుమన్న ఎండలు

## రాగల రెండు రోజుల్లో 42డిగ్రీలకు ఉష్ణోగ్రతలు
## వాతావరణ శాఖ హెచ్చరిక



**మార్చి 26(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఎండలు ముదురుతున్నాయి. మంగళవారం అదిలాబాద్ జిల్లా సాత్నాలలో 42డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో రాగల రెండు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40నుంచి 42డిగ్రీలకు పెరిగే అవకాశాలు ఉన్నట్టు వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రత్యేకించి ఉత్తర తెలంగాణలో ఉష్ణోగ్రతల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నట్టు తెలిపింది. అదిలాబాద్, కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ , నిజామాబాద్ , జగిత్యాల, పెద్దపల్లి ,కరీంనగర్ ,జయశంకర్ భూపాలపల్లి, ములుగు, హనుమకొండ , భద్రాద్రి కొత్తగూడెం ,సూర్యాపేట , నల్లగొండ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని, పగటి ఉష్ణోత్రలు గరిష్టంగా 42 డిగ్రీలకు చేరుకునే అవకాశాలు ఉన్నట్టు వెల్లడించింది.ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. గడిచిన 24గంటల్లో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 41.1 డిగ్రీలు నమోదు కాగా, భద్రాద్రికొత్తగూడెం, కొమరంభీమ్ జిల్లాల్లో 40.8, అదిలాబాద్‌లో 40.7, నిజామబాద్‌లో 40.6, నిర్మల్‌లో 40.5, సూర్యాపేటలో 40.1డిగ్రీలు నమోదయ్యాయి. మహబూబ్ నగర్ , ఖమ్మం జిల్లాల్లో కూడా 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# నీరు లేక ఎండిపోయిన పొలాలను పరిశీలించిన ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

హుజూర్ నగర్: **మార్చి 26(జర్నలిస్ట్ వార్త)** హుజూర్ నగర్ నియోజకవర్గ పరిధిలోని నేరేడుచర్ల మండలంలో ఎండిన పొలాలను పరిశీలించిన బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు,ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్. ఈ కార్యక్రమంలో జిల్లా డి సి సి డైరెక్టర్ అప్పిరెడ్డి, నేరేడుచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ జయ బాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు శ్రీధర్ బాబు, కడియం.వెంకటరెడ్డి,మాజీ జెడ్పీటిసి చన్నబోయిన సైదులు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఎంపీ బడుగుల లింగ యాదవ్ మాట్లాడుతూ రైతుల పొలాలు ఎండుతున్న కనీసం కాంగ్రెస్ పార్టీకి కనికరం లేదు.రుణమాఫీ ఊసే లేదు. రైతుబంధు అందించలేదు.భూగర్భ జలాలు ఇంకిపోయాయి.రైతు గుండె పగిలిపోతుంది.వంద రోజుల్లోనే సుమారు 189 మంది రైతుల ఆత్మహత్యలకు కారణం కాంగ్రెస్ పార్టీనే.నీళ్లు లేక ప్రజలు అరిగోస పడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవడం లేదు.ఎదుటి పార్టీ వారిని ఎలా కొనుగోలు చేయాలా అనే ఆలోచనలోనే మునిగి తేలుతోంది.జిల్లా మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి నీళ్లపై స్పందించకపోవడం చాలా దారుణం. కోమటిరెడ్డి వెంకటరెడ్డి రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతాను అంటున్నాడు.సీఎం రేవంత్ రెడ్డి బొడ్డులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నానంటూ చిల్లర మాటలు



మాట్లాడుతున్నాడు. నాగార్జున సాగర్ లోగతంలో నీరు 503 అడుగుల వరకు ఉన్నా కానీ బిఆర్ఎస్ ప్రభుత్వం నీటిని విడుదల చేసి రైతుల పంట పొలాలని కాపాడింది.నేడు 510 అడుగుల పైన ఉన్న కనీసం రైతులకు నీళ్లు అందించకపోవడం చాలా దారుణం అని అన్నారు.ఒక్కొక్క రైతు ఎకరానికి 30,000 పెట్టుబడి పెట్టి, అప్పుల పాలవుతుంటే కనీసం రైతులకు పెట్టుబడి సాయం కూడా అందించడం లేదన్నారు.రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు నేడు రాష్ట్రవ్యాప్తంగా ఎండిన పంట పొలాల పరిశీలించడం రైతులకి పెట్టుబడి సాయం అందించాలని కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేయడం జరుగుతుంది అని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ కళ్ళు తెరచి నష్టపోయిన రైతులని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు.ఒక్కో రైతుకి 25 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ధర్మబిక్షం జీవితం ఆదర్శ ప్రాయం

## , సి.పి.ఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

సూర్యాపేట టౌన్, **మార్చి 26(జర్నలిస్ట్ వార్త):** స్వతంత్ర సమరయోధుడు తెలంగాణ సాయుధ పోరాట యోధులు మాజీ ఎం.పీ బొమ్మగాని ధర్మ బిక్షం జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయం అని సి.పి.ఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం సి.పి.ఐ ఆఫీస్ ధర్మబిక్షం భవనంలో ఆయన 13వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన ఫోటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నవాబు రాక్షస పాలన, రజాకార్లు, భూస్వాములు, జమీందాల ఆగడాలను అంతమొందించే ఆలోచనలతో లక్షలాది పేద ప్రజల హక్కులను స్వేచ్ఛను కాపాడాలని వారిని ఎదిరించడానికి గుండె ధైర్యంతో నిజంకుశ పాలన అంతం చేయడానికి ఉద్యమాలు నడిపిన గొప్ప వ్యక్తి బొమ్మగాని ధర్మభిక్షం అని కొనాడారు. గీత వృత్తి కార్మికులకు కుల సంఘాల కాకుండా వృత్తి సంఘాలను ఏర్పాటు చేసి కార్మికుల తలరాతలు మార్చటమే కాకుండా దొరలకు ఊడిగం చేసే బతుకుల నుండి విముక్తి చేయించారు. గీత కార్మిక



కుటుంబాలలో వెలుగులు నింపారని వన పెంపకానికి 5 ఎకరాల జీ వో ను సాధించి గ్రామ గ్రామాన తాటి, ఈత వనం పెంచడం ద్వారా ఉపాధి గ్యారెంటీకి పునాదులు వేశారని ఆయన అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు మూసి, డిండి, ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రాజెక్టులపై పనిచేస్తున్న కూలీల హక్కుల సంక్షేమం కోసం సంఘాలు పెట్టి పోరాటాలు నిర్వహించిన కార్మిక నాయకుడు అని కొనియాడారు. ఆ మహనీయుని జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అనంతుల మల్లేశ్వరి సి.పి.ఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పట్టణ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, దోరపల్లి శంకర్, చామల అశోక్ కుమార్, నీల శ్రీనివాస్, గోపగాని రవి, ఎడెల్లి శ్రీకాంత్, దీకొండ శ్రీనివాస్ పెంద్ర కృష్ణ, తాళ్ల సైదులు, హెచ్పి.సి.ఎల్ టాంకర్ సాయిబాబా,దికొండ రవి, పున్నం రమేష్, ఆర్టీసీ సేవ్య, కొత్వాల్ సురేందర్, రూపానివిజయ్, ప్రముఖ లాయర్లు హసన్, తొగటి మురళి, ఎల్.ఐ.సి వెంకట్ రెడ్డి, రహీం, వాడపల్లి వెంకన్నతదితరులు పాల్గొన్నారు.

# రెక్కలు ముక్కలు చేసుకుని ఆ పైసా ఈ పైసా కూడ పెట్టి మోసపోయిన పొదుపు సంఘాలు

సూర్యాపేటమార్చి 26(జర్నలిస్ట్ వార్త): సూర్యాపేట (రూరల్) పాతర్ల పాడు గ్రామం, ఆత్మకూరు (ఎస్), మండలం పరిధిలో చోటుచేసుకున్న పొదుపు సంఘాలు 2015 నుండి ఒక్కటే వి.వి.కె, గ్రామంలో మొత్తం 77 సంఘాలు ఉండగా ఒక్కొక్క వి.వి.కె 2015 నుండి 3250 జమ చేయడం జరిగింది. మొత్తం ఎంత జమ జరిగిందో కూడా మాకు తెలియనీ క్రమంలో తాళ్ల సింగారం బ్యాంకులో సుమారు పది సంవత్సరాలు పొదుపు చేశారు సుమారు రెండు కోట్ల 80 లక్షలు. సింగారం బ్యాంకు మేనేజర్ స్వాహా చేశారు రైతు సంఘాలను, మహిళా సంఘాలని, వి.వి.కె లకు సీ.సీ లకు రైతు, మహిళా ఐదు లక్షలు, 10 లక్షల



లోన్ వస్తుంద ని వి.వి.కె లతో సీ.సీ. లతో లోన్ అప్లికేషన్స్ పెట్టిచ్చి సంఘాలను మభ్యపెడుతూ కాలం గడపసాగారు. సంఘంలో కొందరు నిలదీసి ఓ రోజు బ్యాంకులో చూడగా ఒక సంఘంలో నుంచి ఒక చదువు రాని అనాముకురాలతో ఒక ఓచర్ మీద సంతకం పెట్టి ఇచ్చి లక్ష రూపాయలు డ్రా చేసినట్టుగా తేలడంతో ఆ మహిళ ఎకౌంట్లో సుమారు 50 వేల రూపాయలు వచ్చినట్టుగా తేలడంతో మిగతా డబ్బులు ఏమైనవి అని సంఘాలకు తెలిసి నిలదీయగా నాకు ఏం తెలియదు మీకేమైనా కావాలంటే మీ ఇష్టం వచ్చిన కాడ ఫిర్యాదు చేసుకోండి అని జవాబు ఇవ్వడంతో నివ్వెర పోయిన మహిళ రైతు సంఘాలు, అంతేకాకుండా ఆ మహిళ ఇష్టానుసారంగా దుర్భాషలాడడం ఇలా ఏంటి అని అడిగిన ప్రతి ఒక్కరిని ఊరిని శాసించేలా ప్రవర్తించడంపై విసుగెత్తి పోయిన పొదుపు సంఘాల సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీ.డి కి ఫిర్యాదు చేయడానికి ముందుకు వచ్చారు. యమ గాని లక్ష్మీ మాట్లాడుతూ ఇకనుంచైనా మంచి సభ్యులను ఎన్నుకోవాలని పి.డి చెప్పారని. ముందుగా జరిగిన మోసం గురించి పోలీసు వారికి ఫిర్యాదు చేయమని పి.డి చెప్పారని అన్నారు.

# కేసీఆర్‌ను కలిసిన వరంగల్ లోక్ సభ అభ్యర్థి కడియం కావ్య



**మార్చి 26 జర్నలిస్ట్ జర్నీ న్యూస్ వరంగల్ :** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను వరంగల్ లోక్ సభ అభ్యర్థి కడియం కావ్య హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. లోక్ సభ ఎన్నికల్లో తనకు పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చినందుకు ఆమె అధినేతకు ధన్యవాదాలు తెలిపారు. పన్నెండు రోజుల క్రితం వరంగల్ లోక్ సభ అభ్యర్థిగా కడియం కావ్య పేరును ప్రకటించింది. దీంతో ఆమె జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న ఆమె ఈరోజు కేసీఆర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడి నుంచి రెండు పర్యాయాలు బీఆర్ఎస్ నుంచి పసునూరి దయాకర్ గెలిచారు. ఈసారి ఆయనకు టిక్కెట్ దక్కలేదు. ఇటీవల ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# నల్గొండ ఎంపి స్వతంత్ర అభ్యర్థి గా అంబేద్కర్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు :సోంపంగి. అఖిల్



ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 26(జర్నలిస్ట్ వార్త):: నల్గొండ ఎం పి స్వతంత్ర అభ్యర్థి గా తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ స్టూడెంట్ యూనియన్ ఫౌండర్, చైర్మన్ సోంపంగి అఖిల్ పోటీ చేయునున్నారు. తెలంగాణ ఉద్యమ కాలం లో సైఫాబాద్ డిగ్రీ కాలేజీ లో విద్యార్థి ఉద్యమ నాయకుడు నుండి నేటి వరకు అనునిత్యం విద్యా సమస్య ల పై నిరంతరం పోరాటం చేస్తున్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమ కాలంలో అనేక కేసులు నమోదు అయ్యాయి . నన్ను నల్గొండ లోకసభ ప్రజలు అత్యధిక మెజార్టీ తో గెలిపిస్తారు అని ఆశాభావంతో వ్యక్తం చేశారు.

# ఉద్యమాల యుద్ధభేరి సాంబశివుని 13వ వర్ధంతి



**వలిగొండ మార్చి 26(జర్నలిస్ట్ వార్త):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని దాసిరెడ్డిగూడెం గ్రామంలో. ఉద్యమాల యుద్ధభేరి. సాంబశివుడు 13వ వర్ధంతిని. ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు స్వర్ణలత కూతురు అల్లుడు అనిల్ నారి మల్లేష్ నారి నరసింహ శ్రీశైలం. నారి బాలకృష్ణ సాయికుమార్ మరియు మండల టిఆర్ఎస్ నాయకులు తుమ్మల వెంకటరెడ్డి. కొమిరెల్లి సంజీవరెడ్డి. పడమటి మమత నరేందర్ రెడ్డి. దేగల పాండు. మాద శంకర్ లావణ్య. దామోదర్ రెడ్డి. పాల్గొని ఆయన సేవలను కొనియాడుతూ ఘనంగా నివాళులు అర్పించారు.

# యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఏఐవైఎఫ్. క్రీడోత్సవాలు నిర్వహిస్తుంది



**యాదాద్రి భువనగిరి మార్చి 26(జర్నలిస్ట్ వార్త):** ప్రతినిధిభగత్ సింగ్, రాజు గురు,సుకుదేవ్ ల వర్ధంతి సందర్భంగా అరూరు గ్రామంలో వలిగొండ మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నేటితో నాలుగు రోజులు అవుతున్నాయి యువకులు ఉత్సాహంగా ముందుకొచ్చి ఆటలో పాల్గొంటున్నారని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సుద్దాల సాయికుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూఅవినీతి, అక్రమాలను పారద్రోలడానికి యువత రాజకీయాలకు ఆకర్షితులు కావాలని, చెడు వ్యసనాలను దూరం చేసేందుకు,ఆరోగ్యవంతులుగా ఉండేందుకు క్రీడలు అవసరమని అన్నారు క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం పూర్తిగా అవసరమని, గ్రామీణ స్థాయి నుండే క్రీడలను ప్రోత్సహించి అధిక నిధులు కేటాయించాలన్నారు.ప్రస్తుత సమాజంలో యువత, విద్యార్థులు కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితమైన సమయంలో, యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఏ ఐ వై ఎఫ్ క్రీడలు నిర్వహిస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు మేడి దేవేందర్, నరేష్ పృథ్వీరాజ్ కృష్ణ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# ప్రణీత్ రావుతో పరిచయమే లేదు : ఎర్రబెల్లి



**మార్చి 26 జర్నలిస్ట్ జర్నీ న్యూస్ వరంగల్ :** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుతో తనకు ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు. ఈ కేసులో అరెస్ట్ అయిన ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుతో తనకు పరిచయమే లేదని పేర్కొన్నారు. వరంగల్ లో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ%ా%. ఆయన బంధువులు మాత్రం తమ ఊళ్లోనే ఉన్నారన్న విషయం మాత్రం తనకు తెలిసిందన్నారు. అసలు ఈ కేసులోకి తనను ఎందుకు లాగుతున్నారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కేసుతో తనకు సంబంధం లేదని విచారణలో స్వయంగా ప్రణీత్‌రావే చెప్పారని గుర్తు చేశారు. పార్టీ మారాలంటూ తనపై ఒత్తిడి ఉందని, రాజకీయ కుట్రలో భాగంగానే ఇది జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. ఎవరెన్ని ప్రలోభాలకు గురిచేసినా, ఒత్తిడి తీసుకొచ్చినా పార్టీ మారేది లేదని తేల్చి చెప్పారు. తనపై భూకబ్జా ఆరోపణలు చేస్తున్న శరణ్ చౌదరిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్నాయని దయాకర్‌రావు తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అన్ని నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు.

# మైక్రోసాఫ్ట్ విండోస్‌కు కొత్త చీఫ్‌గా పవన్ దావులూరి

**-పవన్ దావులూరి ఐఐటీ మద్రాస్ గ్రాడ్యుయేట్**
**పనోస్ పనయ్ స్థానంలో పవన్ దావులూరి నియామకం**
**23 ఏళ్లకు పైగా మైక్రోసాఫ్ట్‌లో పనిచేస్తున్న పవన్**
**2001లో రిలయబిలిటీ కాంపోనెంట్ మేనేజర్‌గా మైక్రోసాఫ్ట్‌లో చేరిక**
**ప్రస్తుతం విండోస్ సిలికాన్ అండ్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్‌కు కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్‌గా విధులు**




**మార్చి 26(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:**
మైక్రోసాఫ్ట్ ఆపరేటింగ్ సిస్టమ్ విండోస్, సర్ఫేస్ విభాగాలకు కొత్త చీఫ్‌గా ఐఐటీ మద్రాస్ గ్రాడ్యుయేట్ పవన్ దావులూరి నియమితులయ్యారు. గతంలో ఈ విభాగానికి నేతృత్వం వహించిన పనోస్ పనయ్ స్థానంలో పవన్ దావులూరిని కంపెనీ నియమించింది. పనయ్ గతేడాది అమెజాన్‌లో చేరేందుకు మైక్రోసాఫ్ట్ విండోస్ చీఫ్‌గా వైదొలిగారు. దాంతో ఈ పోస్ట్ అప్పటి నుంచి ఖాళీగానే ఉంది. ఇప్పుడు పవన్‌ను మైక్రోసాఫ్ట్ సంస్థ ఈ పోస్టులో నియమించడం జరిగింది. ఇక పవన్ దావులూరి 23 ఏళ్లకు పైగా మైక్రోసాఫ్ట్‌లో పనిచేస్తున్నారు. యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్‌లో 1999లో ఎంఎస్ పూర్తిచేసిన అనంతరం పవన్.. మైక్రోసాఫ్ట్‌లో 2001లో రిలయబిలిటీ కాంపోనెంట్ మేనేజర్‌గా చేరారు. తాజా నియామకానికి ముందు పవన్ విండోస్ సిలికాన్ అండ్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్‌కు కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దాదాపు మూడేళ్లుగా ఆయన కంపెనీలో కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్‌గా విధుల్లో కొనసాగుతున్నారు. ఇటీవలే మైక్రోసాఫ్ట్‌లో డీప్‌మైండ్ డిపార్ట్‌మెంట్ మాజీ సహ వ్యవస్థాపకుడు ముస్తఫా సులేమాన్‌ను ఏఐ బ్రాంచ్ హెడ్‌గా నియమించింది. ఆ తర్వాత పవన్‌కు కీలక బాధ్యతలు దక్కాయి. ఇక గతంలో విండోస్, సర్ఫేస్ విభాగాలకు వేర్వేరుగా అధిపతులు ఉండగా.. ఇప్పుడు పవన్‌కే ఆ రెండింటి బాధ్యతలు దక్కడం గమనార్హం. కాగా, తాజా నియామకంతో అగ్రరాజ్యం టెక్ కంపెనీల్లో అత్యున్నత పదవులు చేపట్టిన భారతీయ వ్యక్తుల జాబితాలో పవన్‌కు చోటు దక్కినట్లయింది.

# 29న బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం



**మార్చి 26(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:**
పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 29న సిద్దిపేట నియోజకవర్గంలో బీఆర్ ఎస్ కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు మారెడ్డి రవీందర్ రెడ్డి, కడవారెలు రాజనర్సు, పాల సాయిరాం తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు సుపరిచితుడు, ఉన్నత విద్యావంతుడు అయిన వెంకట్రామ్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ ఎంపీ టికెట్ కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.గతంలో మాదిరిగానే మెదక్ పార్లమెంట్ స్థానంపై ఎమ్మెల్యే హరీశ్ రావు నేతృత్వంలో గులాబీ జెండా ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు. వంద రోజుల కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనపై ప్రజల్లో చర్చ మొదలైందన్నారు. ఆరోపణలతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. ఎంపీ అభ్యర్థి పరిచయ కార్యక్రమంతో పాటు విస్తృత సమావేశంలో ఎమ్మెల్యే హరీశ్ రావు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు

# ఫసల్ బీమాకు కేంద్రం గ్రీన్ సిగ్నల్




**మార్చి 26(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:**
తెలంగాణ రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేయాలని రేవంత్ ప్రభుత్వం చేసిన వినతికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. వచ్చే వానాకాలం సీజన్ నుండి ఫసల్ బీమా అమలు చేసే అవకాశం ఉంది. ఈ పథకం రైతులకు అనుకూలంగా లేదని బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యతిరేకించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధం అయ్యింది. వచ్చే వానాకాలం నుంచి ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయిస్తూ, అనుమతి కోరుతూ కేంద్రానికి లేఖ రాసింది. దీనికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి.ఆహార ధాన్యాల పంటలకు 2 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం ప్రీమియం చెల్లిస్తే ఏదైనా నష్టం వచ్చినప్పుడు పరిహారం అందనుంది. కాగా ఈ పథకం అమలు చేయాలంటే తక్షణమే పథకాన్ని అమలు చేసే కంపెనీలను టెండర్ల ద్వారా ఆహ్వానించాలి. దీనికి నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇప్పుడు టెండర్ నోటిఫికేషన్ ఇవ్వాలంటే ఎన్నికల కమిషన్ పర్మిషన్ తప్పనిసరి. ఒకవేళ ఈసీ అనుమతి ఇవ్వకుంటే ఈ పథకం వచ్చే సీజన్ నుంచి అమలు అయ్యే అవకాశాలు తక్కువగానే ఉన్నాయని అంటున్నారు అధికారులు

# కేజ్రీవాల్ అరెస్ట్‌కు వ్యతిరేకంగా ఆప్ నిరసనలు.. సీఎం రాజీనామాకు బీజేపీ డిమాండ్



**మార్చి 26(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:**
ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టయి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. అయితే, కేజ్రీవాల్ అరెస్టు అక్రమం అంటూ ఆప్ నేతలు, కార్యకర్తలు మంగళవారం ఢిల్లీ వ్యాప్తంగా నిరసనకు దిగారు. మరోవైపు ముఖ్యమంత్రి పదవికి కేజ్రీవాల్ వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే కాషాయ పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ కూడా చేపట్టాయి. ఇక ఢిల్లీ సీఎం అరెస్టును వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టిన ఆప్ నేతలు, కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకోవడం జరుగుతోంది. ప్రధాని మోదీ ఇంటిని సైతం ముట్టడించేందుకు ఆప్ కార్యకర్తలు ప్రయత్నించారు. కాగా, నిరసన తెలపడానికి అనుమతి లేదని పోలీసులు వెల్లడించారు. “ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు, నేతలు నిరసనలు చేయడానికి అనుమతి లేదు. పటేల్ చౌక్ మెట్రో స్టేషన్ వద్దకు నిరసనకారులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని మాకు సమాచారం ఉంది. అందుకే మేము భద్రతా చర్యలు చేపట్టాము” అని ఢిల్లీ డిప్యూటీ పోలీస్ కమిషనర్ దేవేశ్ కుమారు తెలిపారు. ఇక మోదీ నివాసం ముందు ఆప్ శ్రేణులు నిరసనకు దిగడంతో బీజేపీ కేజ్రీవాల్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించింది. ఫిరోజ్‌షా కోట్ల మైదానం నుంచి ఢిల్లీ సెక్రటేరియట్ వైపు బీజేపీ మెగా ర్యాలీ చేపట్టింది. జైలు నుంచి పాలన కొనసాగిస్తాననటం సిగ్గుచేటని కాషాయ పార్టీ శ్రేణులు దుమ్మెత్తిపోస్తున్నాయి. అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు



# చెన్నై ఘనవిజయం

చెన్నై: గతేడాది ఫైనలిస్టుల మధ్య జరిగిన మ్యాచ్ ఏకపక్షంగా ముగిసింది. చెన్నై సూపర్ కింగ్స్ అన్ని విభాగాల్లో రాణిస్తూ కలిసికట్టుగా కదం తొక్కింది.
బ్యాటింగ్‌లో శివమ్ దూబే (23 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 51), రచిన్ రవీంద్ర (20 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 46) మెరుపు ఆటతీరును ప్రదర్శించారు. అటు పేసర్లు పదునైన బంతులతో కట్టడి చేయగా, ఫీల్డింగ్‌లోనూ సూపర్ అనిపించుకుంది. దీంతో మంగళవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సీఎసకే 63 రన్స్‌తో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్లకు 206 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ (36 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 46) ఆకట్టుకున్నాడు. రషీద్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 143 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (37), మిల్లర్ (21), సాహా (21) ఫర్వాలేదనిపించారు. తుషార్ దేశ్‌పాండే, దీపక్ చాహర్, ముస్తాఫిజుర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా దూబే నిలిచాడు.
కలిసికట్టుగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు సమష్టి ఆటతీరును కనబరిచారు. ముందుగా ఓపెనర్లు రచిన్, రుతురాజ్ మెరుపు ఆరంభాన్ని అందివ్వగా.. ఆ తర్వాత శివమ్ దూబే శివాలెత్తాడు. ఓపెనర్ల ధాటికి పవర్‌ప్లేలోనే 69 పరుగులు సాధించింది. తొలి ఓవర్‌లోనే గైక్వాడ్ క్యాచ్ అవుట్ నుంచి తప్పించుకున్నా.. మరో ఎండ్‌లో రచిన్ బాదుడుకు ఓవర్‌కు పదకొండు పరుగుల రన్‌రేట్‌తో స్కోరుబోర్డు దూసుకెళ్లింది. రెండో ఓవర్‌లో 6,4తో బ్యాట్‌కు పనిజెప్పిన తను ఎక్కడా ఆగలేదు. మూడో ఓవర్‌లో రెండు ఫోర్లతో 12, నాలుగో ఓవర్‌లో 6,4తో 16, ఐదో ఓవర్‌లో 4,6తో 17 ఇలా ఎదురుదాడే లక్ష్యంగా అలరించాడు. అటు రుతురాజ్ సైతం అడపాదడపా ఫోర్లతో ఆకట్టుకున్నాడు.


# నేడు ఉప్పల్‌లో ముంబయితో సన్‌రైజర్స్ ఢీ



**మార్చి 26(జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్:**
హైదరాబాద్: కొత్త సారథులు.. సరికొత్త ఉత్సాహంతో బరిలో దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబయి ఇండియన్స్ జట్లకు ఆరంభ మ్యాచ్‌ల్లో పరాజయాలు తప్పలేదు.ఆ మ్యాచ్‌ల్లో రెండు జట్లూ విజయానికి దగ్గరగా వచ్చినా ఆఖర్లో తడబాటుతో బోణీ కొట్టలేకపోయాయి. మరి బుధవారం ఉప్పల్ స్టేడియంలో అమీతుమీ తేల్చుకోనున్న సన్‌రైజర్స్, ముంబయిలలో మురిసేదెవరు? గెలుపు బోణీతో పాయింట్ల ఖాతా తెరిచేదెవరు?
కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ గెలుపు ముంగిట బోల్తాపడింది. హెన్రిచ్ క్లాసెన్, షాబాజ్ అహ్మద్ జట్టును విజయానికి చేరువ చేసినా.. హర్షిత్ రాణా అద్భుతమైన బౌలింగ్‌తో కమిన్స్ సేన ఆశలపై నీళ్లు చల్లాడు. గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో ముంబయిదీ అదే పరిస్థితి. చివరి ఓవర్ వరకు రేసులో ఉన్న ముంబయి ఆఖరి నాలుగు బంతుల్లో తడబడి మ్యాచ్‌ను చేజార్చుకుంది. ఇప్పుడీ రెండు జట్లు తొలి గెలుపుపై గురిపెట్టాయి. ఈ సీజన్‌లో సొంతగడ్డపై సన్‌రైజర్స్‌కు ఇదే మొదటి మ్యాచ్. భువనేశ్వర్, మార్కో యాన్సన్, నటరాజన్, కమిన్స్‌లతో బలమైన బౌలింగ్ కలిగిన సన్‌రైజర్స్.. స్థాయికి తగ్గట్లు సత్తాచాటితే ఉప్పల్‌లో బోణీ కొట్టొచ్చు. మిడిలార్డర్‌లో క్లాసెన్, షాబాజ్ మాదిరే.. టాప్ ఆర్డర్‌లో మయాంక్ అగర్వాల్, అభిషేక్‌శర్మ, రాహుల్ త్రిపాఠి, మార్‌క్రమ్ దూకుడు పెంచాలి. భీకరమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన ముంబయికి సన్‌రైజర్స్ బౌలింగ్ పరీక్షగా నిలువనుంది. కోల్‌కతాతో మ్యాచ్‌లో రోహిత్‌శర్మ, బ్రెవిస్ సత్తాచాటినా మిగతా వాళ్లు విఫలమయ్యారు. ఇషాన్ కిషన్, నమన్ ధీర్, తిలక్‌వర్మ, టిమ్ డేవిడ్, కెప్టెన్ హార్దిక్ పాండ్య పూర్తిస్థాయి ఫామ్‌లోకి వస్తే సన్‌రైజర్స్ బౌలర్లకు కష్టమే. ఇక ఐపీఎల్‌లో రెండు జట్లు ఇప్పటి వరకు 21 మ్యాచ్‌లాడగా.. తొమ్మిదింట్లో సన్‌రైజర్స్, పన్నెండింట్లో ముంబయి పైచేయి సాధించాయి. రెండు జట్ల మధ్య గత అయిదు మ్యాచ్‌ల్లో నాలుగుసార్లు ముంబయి గెలిచింది. ఒక మ్యాచ్ సన్‌రైజర్స్ నెగ్గింది.

# శ్రీజకు కెరీర్ బెస్ట్ ర్యాంక్

న్యూఢిల్లీ: గతవారం తన కెరీర్‌లో రెండో డబ్ల్యూటీటీ సింగిల్స్ టైటిల్ నెగ్గి రికార్డు సృష్టించిన తెలుగమ్మాయి ఆకుల శ్రీజ అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో ముందంజ వేసింది.మంగళవారం వెలువడిన తాజా ర్యాంకింగ్స్‌లో శ్రీజ మహిళల సింగిల్స్‌లో ఏడు స్థానాలు ఎగబాకి కెరీర్‌లోనే అత్యుత్తమంగా 40వ ర్యాంక్‌ను అందుకుంది. పురుషుల సింగిల్స్‌లో శరత్ కమల్ 35వ స్థానంలో ఉండగా, సాథియాన్ 43 స్థానాలు మెరుగై 60వ ర్యాంక్‌లో నిలిచాడు.






# గేమ్ చేంజర్.. ఫ్యాన్స్ కు గుడ్ న్యూస్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో చేస్తోన్న మూవీ షూటింగ్ ఫైనల్ స్టేజ్ కి వచ్చేసింది. మరో నెల, రెండు నెలల్లో మూవీ షూటింగ్ మొదలు కానుంది. శంకర్ కూడా గేమ్ చేంజర్ వేగంగా పూర్తి చేసి రిలీజ్ డేట్ పై ఫోకస్ పెట్టే పనిలో ఉన్నారు. ఇండియన్ 2 ఆగష్టులో రిలీజ్ కన్ఫర్మ్ అయిపోయింది. గేమ్ చేంజర్ పోస్ట్ ప్రొడక్షన్ కి ఎంతకాలం పడుతుందనేది అంచనాకి వచ్చి రిలీజ్ పై క్లారిటీ ఇవ్వొచ్చని అనుకుంటున్నారు. ఆర్ఆర్ఆర్ తర్వాత రామ్ చరణ్ పూర్తిస్థాయిలో సోలో హీరోగా చేస్తోన్న మూవీ కావడంతో ఎక్స్ పెక్టేషన్స్ హై ఎండ్ లో ఉన్నాయి. దిల్ రాజు ప్రొడక్షన్ నుంచి వస్తోన్న మొదటి పాన్ ఇండియా మూవీ ఇదే కావడం విశేషం. దీంతో గేమ్ చేంజర్ సినిమాని దిల్ రాజు ప్రెస్టీజియస్ గా తీసుకున్నాడు. థమన్ ఈ సినిమాకి మ్యూజిక్ అందించాడు. ఇదిలా ఉంటే మార్చి 27న గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ బర్త్ డే ఉంది. ఆ రోజున గేమ్ చేంజర్ నుంచి ఏదో ఒక అప్డేట్ వస్తుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. తాజాగా వినిపిస్తోన్న ప్రచారం బట్టి గేమ్ చేంజర్ నుంచి బర్త్ డే సర్ ప్రైజ్ గా సాంగ్ ని రిలీజ్ చేసే అవకాశం ఉందంట. అలాగే బర్త్ డే టీజర్ కూడా రావచ్చని రకరకాల గాసిప్స్ వచ్చాయి. కానీ అందులో నిజం లేదు. ఇక సాంగ్ ఎప్పుడో విడుదల కావాల్సింది. జరగండి అనే ఆ సాంగ్ ముందుగానే లీక్ అవ్వగా పెద్దగా బజ్ క్రియేట్ కాలేదు. కానీ ఇప్పుడు మేకర్స్ మాత్రం అదే సాంగ్ ను రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. ఇక పుట్టినరోజు గేమ్ ఛేంజర్ టీమ్ మరో సర్ ప్రైజ్ ప్లాన్ చేసింది. ఒక స్పెషల్ పోస్టర్ కూడా రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. అంటే ఫ్యాన్స్ కు డబుల్ బొనాంజా అని చెప్పవచ్చు. ఇక థమన్ నుంచి రాబోతున్న పెద్ద పాన్ ఇండియా సినిమా ఇదే కావడంతో సాంగ్స్ ఎలా ఇచ్చాడనేది తెలుసుకోవాలనే ఆసక్తి నెలకొంది. గతంలో జరగండి అంటూ కంపోజ్ చేసిన సాంగ్ లీకైంది. బర్త్ డే కానుకగా అదే పాటని రిలీజ్ చేసే అవకాశం ఉందని టాక్. అలాగే సుకుమార్ దర్శకత్వంలో చేయబోయే 17 సినిమాని హోలీ సందర్భంగా ఎనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో చరణ్ క్యారెక్టర్ కి సంబందించిన లుక్ ఏమైనా మైత్రీ వాళ్ళు రిలీజ్ చేసే అవకాశం ఉందా అనేది తెలియాల్సి ఉంది. బర్త్ డే సందర్భంగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నెక్స్ట్ చేయబోయే ప్రాజెక్ట్స్ కి సంబందించిన అప్డేట్స్ అయితే తెలిసే అవకాశం ఉండొచ్చని అభిమానులు భావిస్తున్నారు.




## ‘ఆహా’ తెరపైకి ‘సుందరం మాస్టర్’

### ఈ నెల 28 నుంచి జరగనున్న స్ట్రీమింగ్




హర్ష చెముడు తొలిసారిగా కథానాయకుడిగా చేసిన సినిమాగా ‘సుందరం మాస్టర్’ రూపొందింది. రవితేజ – సుధీర్ కుమార్ నిర్మించిన ఈ సినిమాకి, కల్యాణ్ సంతోష్ దర్శకత్వం వహించాడు. ఫిబ్రవరి 23వ తేదీన ఇక్కడి థియేటర్లకు ఈ సినిమా వచ్చింది. ఆశించిన స్థాయిలో కాకపోయినా, కొంతవరకూ ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోగలిగింది. అలాంటి ఈ సినిమా ఇప్పుడు ‘ఆహా’ ద్వారా ఓటీటీ ప్రేక్షకులను పలకరించడానికి రెడీ అవుతోంది. ఈ నెల 28వ తేదీ నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. దివ్యశ్రీపాద – హర్షవర్ధన్ ముఖ్యమైన పాత్రలను పోషించిన ఈ సినిమాకి, శ్రీచరణ్ పాకాల సంగీతాన్ని సమకూర్చాడు. ఇందులోని కొన్ని ఎపిసోడ్స్ హాస్యభరితంగా మంచి మార్కులు తెచ్చుకున్నాయి. సుందరరావు అనే టీచర్ ఆంగ్లాన్ని బోధించడానికి ఒక ఫారెస్ట్ ప్రాంతంలోని గిరిజన గూడెంకు వెళతాడు. తాను ఆ ప్రాంతానికి ఎందుకు పంపించబడ్డాననే విషయం అక్కడికి వెళ్లిన తరువాత అతనికి అర్థమవుతుంది. అప్పుడు అతను ఏం చేస్తాడు? పరిణామాలు ఎలా ఉంటాయి? అనేది కథ. ఈ తరహా కంటెంట్ కి ఓటీటీ వైపు నుంచి మంచి ఆదరణ లభించే అవకాశం ఉందనే చెప్పాలి.

## అమ్మడి కష్టాన్ని దర్శకులు గుర్తించాలి..!



సక్సస్ కొడుతున్న హీరోయిన్స్ కు వరుస ఆఫర్లు రావడం పెద్ద కష్టమేమి కాదు. ఆ హిట్ జోష్ ఆటోమేటిక్ గా అవకాశాలను తెచ్చిపెడతాయి. కానీ ఒక్కసారి ఫ్లాప్ ఫేస్ చేస్తే మాత్రం దాన్ని దాటి ఆఫర్లు రావాలంటే మాత్రం చాలా కష్టం. హిట్లు కొడుతున్నప్పుడు ఎలా అయితే ఎంకరేజ్ చేస్తారో ఫ్లాపులు వస్తుంటే అంత నిరుత్సాహ పరుస్తారు. అసలే తక్కువ కెరీర్ స్పాన్ ఉన్న హీరోయిన్స్ ఈ విషయంలో చాలా అలర్ట్ గా ఉండాల్సి ఉంటుంది. తెలుగులో మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ కొట్టి ఆ తర్వాత వరుస వరుస ఫ్లాపులు ఖాతాలో వేసుకున్న కృతి శెట్టి పరిస్థితి అలానే ఉంది. ఉప్పెనతో తెరంగేట్రం చేసిన అమ్మడు ఆ సినిమాతో యూత్ ఆడియన్స్ మనసులు దోచేసింది. ఇండస్ట్రీకి మరో స్టార్ హీరోయిన్ వచ్చేసిందని అనుకున్నారు. ఆ సినిమా టైం లో కృతి శెట్టి కనబడితే చాలు సోషల్ మీడియా అంతా ఒక రేంజ్ లో హడావిడి కనిపించేది. ఉప్పెన తర్వాత చేసిన రెండు సినిమాలు కూడా పర్వాలేదు అనిపించాయి. కానీ ఆ తర్వాతే మొదలైంది అసలు సినిమా.. వరుస ఫ్లాపులు అమ్మడి గ్రాఫ్ పడిపోయేలా చేశాయి. ఉప్పెనతో ఏర్పడిన క్రేజ్ అంతా కూడా వరుస ఫ్లాపుల వల్ల కెరీర్ డౌన్ ఫాల్ అవుతూ వచ్చింది. అప్పుడు తన కోసం వెంట పడ్డ దర్శక నిర్మాతలు ఇప్పుడు తను చేస్తానన్నా మొహం చాటేసే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం శర్వానంద్ తో మనమే సినిమా ఒక్కటే అమ్మడి చేతిలో ఉంది. ఆ సినిమా మీదే తన ఆశలన్నీ పెట్టుకుంది కృతి శెట్టి. టాలీవుడ్ లో ఎంత స్పీడ్ గా స్టార్ క్రేజ్ తెచ్చుకుందో అంతే స్పీడ్ గా కెరీర్ గ్రాఫ్ పడిపోయేలా చేసుకుంది కృతి శెట్టి. అందుకే కెరీర్ మళ్లీ గాడిన పడాలంటే గ్లామర్ విషయంలో టాప్ గేర్ వేయక తప్పదని డిసైడ్ అయ్యింది. అందుకే ఎంట్రీ ఇచ్చిన టైం లో స్కిన్ షోకి అసలు ఛాన్స్ ఇవ్వని అమ్మడు ఈమధ్య గ్లామర్ షో తో ఎట్రాక్ట్ చేస్తుంది. తనలో ఈ గ్లామర్ యాంగిల్ కూడా వాడుకోండని మేకర్స్ కి హింట్ ఇస్తుంది బేబమ్మ. సినిమా ఛాన్సులు లేక ఖాళీగా ఉండలేక వరుస ఫోటో షూట్స్ తో తన ఫాలోవర్స్ ని అలరిస్తుంది కృతి శెట్టి. అంతేకాదు ఇక మీదట గ్లామర్ రోల్స్ కి సై అనేలా ఫోటో షూట్స్ తో కష్టపడుతుంది. మరి అమ్మడి కష్టాన్ని గుర్తించి ఏ డైరెక్టర్ ఛాన్స్ ఇస్తాడో చూడాలి.

## మళ్లీ ఎన్నికల ముందే బాలయ్య రచ్చ!



2024 ఎన్నికల ముందు నటసింహ … అయిందా? 2014 ఎన్నికల సమయా… గుర్తు చేయబోతున్నారా? అంటే అవున… ప్రస్తుతం బాలయ్య ఫుల్ స్వింగ్ లో ద… సంగతి తెలిసిందే. బ్యాక్ టూ బ్యాక్ స… ఉన్నాడు. అఖండ. వీరసింహారెడ్డి .భగ… విజయాలు నమెదు చేసారు. డబుల్ … చేస్తున్నారు. ప్రస్తుతం బాలయ్య కమిట్… బలంగా ఉన్నాయి. బాబితో 109వ సినిమా చేస్తున్నారు. అది పూర్తికాగానో మరో ఇద్దరు స్టార్ డైరెక్టర్లను రంగంలోకి దించాలని ఇప్పటినుంచే ప్రణాళికలు వేస్తున్నారు. ఇలా బాలయ్య ఓ పక్కా ప్లాన్ తో ముందుకెళ్తున్నాడు. అటు రాజకీయాల్లో సైతం అంతే బిజీగా ఉంటున్నారు. ఇలా రెండు పడవల ప్రయాణం చేస్తూనే ఏపీ రాజకీయాల్లో మళ్లీ కలవరం పుట్టించడానికి రెడీ అవుతున్నారు ఆయన హీరోగా నటించిన లెజెండ్ చిత్రాన్ని మార్చి 30న రిలీజ్ చేస్తున్నారు. రెండు రాష్ట్రాల్లోనూ భారీ ఎత్తున రిలీజ్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈసినిమా మార్చి 28 తో రిలీజ్ అయి పదేళ్లు పూర్తవుతుంది. ఈ సందర్భం కలిసి రావడంతో పాటు..ఏపీలో ఎన్నికల వేడి ముందు ఇలాంటి చిత్రాన్ని అభిమానుల ముందుకు తీసుకొస్తే అదో వేడిలో పనిచేస్తుందని రిలీజ్ ఇలా ప్లాన్ చేసినట్లు కనిపిస్తుంది. సరిగ్గా 2014 ఎన్నికల ముందు ఈ చిత్రం రిలీజ్ అయి భారీ విజయం సాధించింది. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆ సినిమా రిలీజ్ అవ్వడం..చంద్రబాబు సీఎం అవ్వడం...బాలయ్య ఎమ్మెల్యే అవ్వడం ఎంతో శుభ సూచికంగా ఆ సినిమాతో కనిపించింది. అందుకే మరోసారి 2024 ఎన్నికల్లోనూ లెజెండ్ ని మళ్లీ ఇలా అస్త్రంలా దించుతున్నారు. మరి ఈ సెంటిమెంట్ ఎంతవరకూ వర్కౌట్ అవుతుందో చూడాలి. 2019 ఎన్నికల్లో బాలయ్య నటించిన రూలర్ రిలీజ్ అయింది. ఆ సినిమా ఫ్లాప్ అయింది. టీడీపీ అధికారం కోల్పోయింది. అదే ఏడాది ఎన్టీఆర్ బయోపిక్ రెండు భాగాలు కూడా రిలీజ్ అయింది. ఆ రెండు భాగాలు కూడా ఆశించిన ఫలితాలు సాధించని సంగతి తెలిసిందే

## కెమెరా ముందు రొమాన్స్ అంత సులువు కాదు!



బ్లాక్ బస్టర్ ‘డిజె టిల్లు’కు సీక్వెల్ గా రూపొందిన టిల్లూ స్క్వేర్ విడుదలకు రెడీగా ఉంది. సిద్ధు జొన్నలగడ్డ డిజె టిల్లుగా తన పాత్రను తిరిగి పోషించగా.. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ అతడితో రొమాన్స్ చేస్తోంది. ఇంతకుముందు విడుదలైన ట్రైలర్ లో అనుపమ సన్నివేశాలు చర్చనీయాంశంగా మారాయి. సిద్ధూతో ఆమె చేసిన శృంగార సన్నివేశాలు చాలా మందిని ఆకర్షించాయి. చివరగా అనుపమ ఈ సీన్స్ గురించి తన మౌనాన్ని వీడింది. టిల్లు స్క్వేర్‌లో అనుపమ పరమేశ్వరన్ లిల్లీగా నటించింది. ఈ చిత్రం 2024లో అనుపమకు మూడో సినిమా. ఇవేగాక అనేక ప్రాజెక్ట్‌లు క్యూలో ఉన్నాయి. ఇంతకు ముందు రవితేజతో డేగ సినిమాలో నటించి ఆ తర్వాత జయం రవితో సైరన్‌లో నటించింది. ప్రతిసారీ వైవిధ్యం ఉన్న పాత్రల్లో మెప్పించేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పుడు టిల్లు స్క్వేర్ సినిమాలో బోల్డ్ సన్నివేశాల్లో నటించింది. దీని గురించి అనుపమను అడిగినప్పుడు తన సినిమాలలో విభిన్నమైన పాత్రలను పోషించేందుకు ప్రయత్నిస్తున్నానని స్పష్టం చేసింది. అనుపమ పరమేశ్వరన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఈ సందర్భంగా టిల్లూ స్క్వేర్‌లో సిద్ధు జొన్నలగడ్డతో నటించిన ఘాటైన సన్నివేశాల గురించి హోస్ట్ ప్రశ్నించారు. ఇందులో రొమాన్స్ సీన్స్ గురించి ప్రశ్నించారు. అయితే కెమెరాల ముందు అంతమంది సమక్షంలో రొమాన్స్ సీన్లలో నటించడం అంత సులువు కాదని అనుపమ అంది. వందమంది ముందు నటించడం చాలా కష్టం. ఆ సమయంలో పాత్రలో లీనమవుతూ, ఆడియెన్స్ ని మెప్పించాల్సి ఉంటుంది. ఇది అంత ఈజీ కాదని అంది. రొమాన్స్ ని బాగా ఎంజాయ్ చేస్తున్నారు కదా? అని అనుకుంటారు. కానీ అది నిజం కాదు. ఈ సినిమాలో కిస్ సీన్ గురించి అందరూ అడుగుతున్నారని కూడా అనుపమ తెలిపింది. గతంలోను అనుపమ జర్నలిస్టులపై ఘాటుగా స్పందించింది. ప్రేమమ్ లో నటించేప్పుడు నా వయసు 19. అప్పటి వయసుకు తగ్గట్టు పాత్రలు చేసాను. ఇప్పుడు నా వయస్సు 29, కాబట్టి నేను విభిన్న పాత్రలను అన్వేషించాల్సి ఉంది అని కూడా అంది. నేను ఒకే రకమైన పాత్రలు పోషించినప్పుడు కూడా, జర్నలిస్టులు, ప్రజలు ఎందుకిలా చేసావు అనడుగుతారు. నేను లిల్లీ వంటి పాత్రలు చేసినప్పుడు, ఇలాంటి వాటిని ఎందుకు చేయాలని నిర్ణయించుకున్నావు? అని మీరే మళ్లీ అడుగుతారు. నేనేం చేయాలి? ఇంట్లోనే ఉండాలా? అని ఎదురు ప్రశ్నించింది. మల్లిక్ రామ్ టిల్ స్క్వేర్‌కి దర్శకత్వం వహించగా, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ – ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ దీనిని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. 29 మార్చి 2024న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది.